సాక్షి తిరుపతి

గురువారం । 26 । డిసెంబర్ । 2024



తిరుపతి ఈస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు (ఇన్‌సెట్) సందేశం ఇస్తున్న పాస్టర్

ప్రేమ సందేశం



విద్యుత్ వెలుగుల్లో తిరుపతిలోని వెస్ట్ చర్చి

తిరుపతి జిల్లాలో క్రిస్మస్ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. బుధవారం ఉదయం శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు తదితర నియోజక వర్గాల్లో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. - తిరుపతి కల్చరల్



శ్రీకాళహస్తిలో ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ

న్యూస్‌రీల్

27 నుంచి జాతీయ నాటక పోటీలు



మాట్లాడుతున్న సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 65వ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 27, 28, 29 తేదీలలో మూడు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నాటక పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు ఆ పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. బుధవారం ప్రకాశం రోడ్డులోని ఎస్వీ కళాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు నృత్య ప్రదర్శనలతో పాటు జాతీయ స్థాయి నాటక పోటీల ప్రదర్శన ఉంటుందన్నారు. విజేతలకు అశ్వం అవార్డులతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సుబ్బరాజు కళాపరిషత్ ఉపాధ్యక్షులు ఆమూరి సుబ్రమణ్యం, డీ.గోపాలరావు, సంయుక్త కార్యదర్శులు కే.కేశవులు, పీ.మునిసుబ్రమణ్యం, సభ్యులు నారాయణస్వామి, పీ.యశోద, కే.శ్రీధర్ పాల్గొన్నారు.

వీఆర్‌కు రాపూరు సీఐ

సైదాపురం: రాపూరు సీఐ విజయకృష్ణను వీఆర్‌కు పంపుతూ బుధవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో బాపట్ల జిల్లా ఎస్బీ సీఐ చిన్న సత్యనారాయణను రాపూరు సీఐగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే బాధ్యతలు చేపట్టిన విజయకృష్ణ కొద్దిరోజుల్లోనే వీఆర్‌కు పంపడం గమనార్హం.

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

జాబ్‌మేళా రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాఫ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో అరబిందో ఫార్మా, భార్గవి ఆటో మొబైల్స్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితర కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్‌తో పాటు ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు htt lps://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకుని అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యేటప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో అడ్మిట్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 81435 76866 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ఝాన్సీ ప్రతిభ

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు హైస్కూల్ విద్యార్థిని డి.ఝాన్సీ ఈ నెల 23న విజయవాడలో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొంది. ఈ సందర్భంగా వర్చువల్ హియరింగ్ అండ్ డిజిటల్ యాక్సెస్ టు కన్స్యూమర్ జస్టిస్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థిని ఝాన్సీ ద్వితీయ స్థానం సాధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా విద్యార్థిని బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని ఝాన్సీని పాఠశాల హెచ్‌ఎం మాధవయ్య, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

'ధరలు పెరిగాయ్.. ఏదికొనాలన్నా చేతులు కాలుతున్నాయ్.. అందుకే నా ఆడ బిడ్డలు కష్టపడకూడదని ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తా. తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు.. వారందరికీ సంవత్సరానికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తా..' అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాట మార్చేసింది. సవాలక్ష నిబంధనలతో దీపం–2 పథకాన్ని పక్కదారి పట్టిస్తోంది. సిలిండర్లు తీసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేస్తామని చెప్పి చేతులు పైకెత్తేసింది. జిల్లాలో చాలా మంది సిలిండర్లు తీసుకుని నగదు కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. కోతల దీపం–2..పై 'సాక్షి' ప్రత్యేక కథనం..







50 వేల మంది తొలగింపు

ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట మాట్లాడడం చంద్రబాబు నైజం. ఇప్పుడు కూడా అదే అమలు చేస్తున్నారు. దీపం పథకానికి నిబంధనల పేరుతో అర్హుల సంఖ్యను భారీగా తగ్గించేశారు. ఎన్నికలప్పుడు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పుస్తకం ఉంటే చాలని చెప్పి.. ఇప్పుడు 'సిక్స్ స్టెప్స్' వెరిఫికేషన్ పేరుతో అర్హులను తగ్గించేశారు. ఈ మేరకు జిల్లాలో 50 వేల మందికిపైగా దీపం పథకానికి అర్హతలేకుండా పోయారు.

కోతల దీపం!

తుస్‌మన్న ఉచిత గ్యాస్ పథకం

- ఆరు నిబంధనలతో దీపం–2ను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికల ముందు రేషన్, ఆధార్ కార్డులుంటే చాలంటూ హామీల వర్షం
- అధికారంలోకి వచ్చాక అడ్డగోలు నిబంధనలు
- ఆది నుంచి చంద్రబాబుకు మాటమార్చడం అలవాటే
- సిలిండర్ తీసుకున్నా నగదు జమకాలేదంటున్న లబ్ధిదారులు

అంతా కోతలే

తొలుత గత అక్టోబర్ 28న దీపం పథకానికి సంబంధించి అర్హుల జాబితాను వెలువరించారు. ఆ తర్వాత సరిగ్గా రెండు వారాల తర్వాత 12 శాతం మందిని అర్హుల జాబితా నుంచి తొలగించి మరో జాబితా పంపారు. ఈ విషయం తెలియని చాలా మంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యి వారం రోజులైనా బ్యాంకు ఖాతాలో నగదు జమకాలేదని గ్యాస్ ఏజెన్సీలను సంప్రదిస్తున్నారు. దీంతో నిర్వాహకులు సిక్స్ స్టెప్స్‌లో మీ పేరు ఎగిరిపోయి ఉంటుందని సమాధానం ఇస్తున్నారు.

జిల్లా సమాచారం	
తెల్ల రేషన్‌కార్డులు 6,03,000	గ్యాస్ ఏజెన్సీలు 41
3 సిలిండర్ల చొప్పున ఏడాదికి ఇవ్వాల్సింది 18,09,000	
గ్యాస్ కనెక్షన్లు 4,92,404	దీపం–2కి అర్హులు 4.7లక్షల మంది
అర్హుల జాబితాలో తేలిన సంఖ్య 4.20 లక్షల మంది	

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పేరుతో ఆర్భాటాలు చేసింది. ఇందులో దీపం–2 పథకాన్ని ముందుకు తీసుకొచ్చింది. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తామంటూ జబ్బలు చరిసింది. దీపావళి నుంచి దీపం పథకానికి శ్రీకారం చుట్టినా సవాలక్ష ఆంక్షలతో కోతలు పెడుతోంది. అర్హత ఉన్నా నగదు జమచేయకుండా నిర్లక్ష్యం చేస్తోంది. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు తికమక పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెలగని దీపం

గత నవంబర్ నుంచి తెల్లరేషన్‌కార్డు ఉన్న పేదలు అందరికీ ఉచిత సిలిండర్లు ఇస్తున్నట్టు కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. నవంబర్ నుంచే మార్చి 31 వరకు మొదటి సిలిండర్, ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు రెండో సిలిండర్, ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు మూడో సిలిండర్‌ను అందిస్తామని పేర్కొన్నారు. సిలిండర్ బుక్ చేసిన తర్వాత లబ్ధిదారుడు సిలిండర్‌ను అందుకున్న సమయంలో కట్టే రూ.819ను 48 గంటల్లో వారి ఖాతాలోనే జమచేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ ఇది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. నామమాత్రంగా కొందరికే నగదు జమచేస్తూ మిగిలిన వారిని గాలికొదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

సూపర్–6.. మోసం ఫిక్స్

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి కూటమి సర్కార్ తాజాగా ఆరు నిబంధనలు విధించింది. ఇందులో మొదట రేషన్‌కార్డు ఉండాలి, తర్వాత ఆధార్, భూమి పది ఎకరాల్లోపు ఉండాలి. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా ఉండాలి. కుటుంబంలో ఒకరికే గ్యాస్ కనెక్షన్.

పైసా కూడా పడలేదు



నేను గ్యాస్ బుక్ చేశాను. సిలిండర్ ఇచ్చారు. వారికి డబ్బులు చెల్లించాను. 48 గంటల్లో ఆ నగదు మా అకౌంట్‌లో జమ చేస్తారని చెప్పారు. అయితే పది రోజులు గడించి. అయినా నా ఖాతాల్లోకి జమకాలేదు. ఆ నగదు కోసం ఎదురుచూస్తున్నాను. ఏమైనా ఇబ్బందులు ఉంటే మాకు తెలియజేస్తే వాటిని సవరించుకుంటాం. కానీ చెప్పే నాథుడే లేరు.

–శ్యామలమ్మ, కొర్లగుంట, తిరుపతి

మోసం చేశారు



మేము చాలా పేదవాళ్లం. ప్రభుత్వం ఇస్తున్న దీపం–2 పథకానికి అర్హులమే. రెండు వారాల క్రితం గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్నాం. ఆ మేరకు సిలిండగ్ ఇచ్చారు. మేము నగదు చెల్లించాం. అయితే మాకు తిరిగి సబ్సిడీ మొత్తం మా ఖాతాలో జమ కాలేదు. ఆందోళన చెందుతున్నాం. ప్రభుత్వ మోసం చేసింది అనుకుంటున్నాం.

–యశోద, లీలామహల్ సర్కిల్, తిరుపతి

అందరికీ వేస్తారు



దీపం–2 పథకం ద్వారా అందరికీ తిరిగి ఆ సిలిండర్ నగదును మీ బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తాం. అయితే నాలుగు నెలలుగా ఒక సిలిండర్‌కు మాత్రమే నగదు వస్తుంది. ఆ తర్వాత మిగిలిన సిలిండర్లు బుక్ చేసుకున్నప్పటికీ నగదు రాదు. మార్చి 31వ తేదీ వరకు తొలి సిలిండర్‌కు అవకాశం ఉంది. ఆ తర్వాత నాలుగు నెలలుకు మరో సిలిండర్‌కు.. ఆ తర్వాత మరో నాలుగు నెలలకు ఇంకో సిలిండర్‌కు నగదు వేస్తారు.

–శేషాచలం రాజు, జిల్లా సివిల్‌సప్లయ్ అధికారి

ఉచితమని మోసం చేశారు



రేషన్ కార్డుదారులకు గ్యాస్ సిలిండర్ ఉచితమన్నారు. సిలిండర్ తీసుకున్న 48 గంటల్లో లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో నగదు జమచేస్తామన్నారు. నేను 15 రోజుల క్రితం సిలిండర్ తీసుకున్నా. ఇంతవరకు నగదు జమకాలేదు. ఇలా ఎంత మంది మోసపోయారో..?

– దినకర్‌బాబు, ఏరూరు, చిల్లకూరు మండలం

చిల్లిగవ్వ కూడా పడలేదు



సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితమని చెప్పింది. గ్యాస్ బుక్ చేసుకుని రోజులు గడుస్తునా నేటికీ ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వకూడా బ్యాంకు ఖాతాలో జమకాలేదు. రోజూ బ్యాంక్‌కు వెళ్లి గ్యాస్ డబ్బుల కోంస చేక్ చేసుకుంటున్నా. అంతా మాయగా ఉంది.

మన్నారపు సుధాకర్‌యాదవ్, వెంకటగిరి

- స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్
- పొర్లుకట్టలు ధ్వంసం చేస్తున్న ఇసుకాసురులు
- అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెంలో అధికార పార్టీ నేతల అరాచకం

పొర్లుకట్టలు తెగ్గొట్టి..

స్వర్ణమ్మను చెరబట్టి!



మూర్తిరెడ్డిపాళెం వద్ద ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకాసురులు



మూర్తిరెడ్డిపాళెం వద్ద అధికారులు వేసిన అడ్డుకట్టలను తొలగించిన ఇసుకాసురులు

నాయుడుపేట టౌన్: అధికార మదంతో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. పొర్లుకట్టలు తెగ్గొట్టి మరీ స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. 'అధికార పార్టీ వాళ్లం.. అడిగితే అంతుచూస్తాం' అన్నట్టు బరితెగిస్తున్నారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని ఎల్ఏసాగరం, బీడీ కాలనీ, చిగురుపాడు, తుమ్మూరు, మర్లపల్లి, అన్నమేడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డిపాళెం, భీమవరం తదితర గ్రామాల్లో స్వర్ణముఖినది పొర్లు కట్టలను ఇష్టా రాజ్యంగా ధ్వంసం చేస్తున్నారు. ట్రాక్టర్లతో పాటు భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఈ అక్రమ దందాకు అధికారులు దాసోహమైనట్టు పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఉచితం పేరుతో స్మగ్లింగ్

ఇసుక ఉచితం పేరుతో అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇంటి అవసరాల పేరుతో కొంత తరలిస్తూ అధికంగా పరిశ్రమలతో పాటు డంపింగ్ యార్డులకు మళ్లిస్తున్నారు. ఆపై అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇసుకను డంపింగ్ చేసుకుని రాత్రి పూట టిప్పర్లలో తమిళనాడుకు తరలిస్తున్నారు. టిప్పర్లకే కాకుండా తడ ప్రాంతానికి చెందిన కొంతమంది ఇసుక స్మగ్లర్లు నాయుడుపేటకు వచ్చి ట్రాక్టర్లలో నింపుకుని తమిళనాడు సరిహద్దు వరకు వెళ్తున్నారు. రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు మూర్తిరెడ్డిపాళెంలో గ్రామంలో రెండు చోట్ల స్వర్ణముఖి నది వద్ద వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్టలు వేశారు. అయితే అయ్యప్పరెడ్డిపాళెం, దళితవాడ సమీపంలో ఉన్న నది వద్ద అధికారులు వేసిన అడ్డుకట్టలను బుధవారం ఇసుకాసురులు తొలగించేశారు. ఆపై యథేచ్ఛగా అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం గ్రామాల నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ఇసుకాసురుల ఆగడాలతో పలు గ్రామాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నాయుడుపేట మండలంలో ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

దాతలు ఆదుకోండి



చికిత్స పొందుతున్న ధనుంజయరెడ్డి

శ్రీకాళహస్తి: తొండమనాడుకు చెందిన ధనుంజయరెడ్డిని ఇటీవల గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. తలకు బలమైన గాయంతో పాటు కడుపులో పేగుకు రంధ్రం పడడం వల్ల వైద్యులు ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఇందుకు సుమారు రూ.5 లక్షల వరకు అవుతుందని చెప్పారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ఎవరైనా ధనుంజయరెడ్డి కుమారుడు వినోద్‌కుమార్ 9550062561 నంబరుకు ఫోన్‌పే చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శరత్‌చంద్ర

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట–కడప మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుంటూరు జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట–కడప మార్గంలోని మాముండూరు సమీపంలో బుధవారం గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గుంటూరు జిల్లాకు చెందిన చైతన్య శ్రీనివాసులు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట సీఐ శరత్‌చంద్ర తమ సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గేదెలను ఢీకొట్టిన వాహనం



కలువాయి: కలువాయి మండలం, మాదన్నగారిపల్లి సమీపంలో 565 జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరె వెంకటేశ్వర్లుకు చెందిన నాలుగు గేదెలు మృతి చెందాయి. తెల్లవారుజామున గేదెలు రోడ్డుపై నడిచి వెళ్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ వాటిని ఢీకొట్టింది. దీంతో గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. తర్వాత టిప్పర్ ఆగకుండా వెళ్లి పోయింది. గేదెల విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని, తన కుటుంబానికి అవే జీవనాధారమని బాధిత రైతు బోరున విలపించాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు. 565 జాతీయ రహదారిపై మార్జిన్లు కంపచెట్లతో మూసుకుపోవడం, రహదారి పక్కనే పొలాలు ఉన్నవారు ఫెన్సింగ్‌ను, రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించడం కారణంగా గేదెలు రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోంది. ఆరు నెలల్లో ఈ రహదారిపై 30కి పైగా గేదెలు, ఆవులు మృతి చెందాయని రైతులు చెబుతున్నారు.

విద్యా మండలిలో నారాయణ ప్రిన్సిపల్ నియామకమా?

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటర్మీడియెట్ విద్యా మండలిలో నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌ను నామినేటెడ్ సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం దారుణమని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ(ఏఐఎస్ఈసీ) జిల్లా ఇన్‌చార్జ్ ఎ.హరీష్ ఓ ప్రకటనలో తప్పుబట్టారు. ఇంటర్ విద్యను ప్రైవేటుపరం చేశాక వెలుగులోకి వచ్చిన నారాయణ విద్యాసంస్థ ఆకృత్యాలకు అవధులు లేకుండా పోయాయని విచారం వ్యక్తం చేశారు. అధిక ఫీజులు, అదనపు తరగతులు, గ్రంథాలయాలు, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు ఏవీ లేకుండానే ఇంటర్ నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యను వ్యాపారం చేశారని మండిపడ్డారు. నిత్యం మార్కులు, ర్యాంకుల పేరుతో విద్యార్థులను వేదనకు గురిచేస్తున్నారని, జైళ్లను తలపించేలా కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నారని దుయ్యబట్టారు. అలాంటి విద్యాసంస్థకు చెందిన ప్రిన్సిపల్‌ను మండలిలో నామినేటెడ్ సభ్యునిగా నియమించడం దుర్మార్గమని ఆరోపించారు.

ఇవి కనిపించలేదా?

- పచ్చాలమ్మ ఆలయం వద్ద హడావిడిగా ఆక్రమణల తొలగింపు
- అంతటితో సరిపెట్టుకున్న ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖలు
- శ్రీకాళహస్తి–తడ–సత్యవేడు మార్గంలో విచ్చలవిడిగా రోడ్లకిరువైపులా ఆక్రమణలు
- వాటిజోలికెళ్లని అధికారులు


శ్రీకాళహస్తి మార్గంలోని బత్తలవల్లం వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలు


వరదయ్యపాళెం టౌన్‌లో రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించిన భవనాలు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్‌కండ్రిగ మండలం, పచ్చాలమ్మ గుడి వద్ద నెల క్రితం హడావిడిగా రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖలు రోడ్డు పక్కన బతుకు జీవనం కోసం దుకాణాల ఏర్పాటుకు నిర్మించుకున్న కట్టడాలను తొలగించారు. జేసీబీతో కట్టడాలను కూల్చి వేశారు. దీంతో అధికారుల ఏకపక్ష నిర్ణయానికి అక్కడ ఉపాధి పొందుతున్న 11 నిరుపేద కుటుంబాలు వీధినపడ్డాయి. శ్రీకాళహస్తి–తడ– సత్యవేడు మార్గంలో విచ్చలవిడిగా ఆక్రమించి, కళ్లు చెదిరేలా భవంతులు నిర్మించినా వాటి జోలికెళ్లలేదు. ఇవి కనిపించలేదా సారూ..? అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

ఆక్రమణల జోరు

ఆక్రమణల తొలగింపు ఒక పచ్చాలమ్మ ఆలయం వరకే పరిమితం కాకుండా శ్రీకాళహస్తి–తడ ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న ఆక్రమణలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆ దిశగా పదోమైలు, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం టౌన్, బత్తవల్లం, రాచకండ్రిగ గ్రామాల వద్ద రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఆ స్థలాల్లో భవంతులు నిర్మిస్తున్నారు. అధికారులు మాత్రం వాటిని నిలువరించే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తడ–సత్యవేడు మార్గంలో అదే పరిస్థితి

కడూరు కూడలి నుంచి కంచరపాళెం, చిన్న పాండూరు, వీకేఆర్‌పై కాలనీ, రాళ్లకుప్పం, రాచపాళెం, అమాసరెడ్డికండ్రిగ వరకు రోడ్డుకిరువైపులా రోడ్లు భవనాల శాఖకు చెందిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

అడ్డుకట్ట పడేనా?

శ్రీకాళహస్తి–తడ–సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను నిలువరించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టడం సాధ్యమేనా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పచ్చాలమ్మ గుడి వద్ద తొలగించిన స్థాయిలో మిగిలిన ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత అధికారుల మీద ఉంది. అయితే రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, ఇతర పరిస్థితులను అధిగమించి ఆక్రమణల తేనెతుట్టెను అధికారులు ఏమాత్రం కుదుపుతారో వేచి చూడాలి మరి.


చిన్న పాండూరు సమీపంలోని హీరో పరిశ్రమ మార్గంలో అక్రమ నిర్మాణాలు


బీఎన్‌కండ్రిగ మండలం, పచ్చాలమ్మగుడి వద్ద ఆక్రమణలు తొలగిస్తూ.. (ఫైల్)

రెవెన్యూ అధికారులకు విన్నవిస్తాం



తడ–శ్రీకాళహస్తి–సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గాల్లో పలుచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ఆక్రమణ స్థలాలను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులకు లేఖలు సిద్ధం చేస్తున్నాం. వాటిని అందజేసిన తర్వాత వారు గుర్తించిన మేరకు సంయుక్తంగా ఆక్రమణలు తొలగిస్తాం.

–రాంబాబు, డీఈ,
ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్, శ్రీకాళహస్తి

పళ్లిపట్టు నాగరాజుకు సాహితీ పురస్కారం


పురస్కారం అందుకున్న పళ్లిపట్టు నాగరాజు

వరదయ్యపాళెం: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పళ్లిపట్టు నాగరాజు సాహితీ పురస్కారం అందుకున్నారు. బుధవారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జరిగిన తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో ముగ్గురు రచయితలకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పళ్లిపట్టు నాగరాజును పురస్కారంతో సత్కరించి రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగధర ప్రసాద్, సంఘం నాయకులు దామోదర నాయుడు, తోట వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, జయరాం ప్రసాద్, యువశ్రీ మురళి, శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య, పురుషోత్తమ ఆచారి ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,209 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.15 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కలివిడిగా ఉంటూ.. కన్నీళ్లు మిగిల్చారు!

- ఏం కష్టమొచ్చిందో.. కలిసే కడతేరిపోయారు
- కూచువారిపల్లెలో దంపతుల బలవన్మరణం
- మంచి ఉద్యోగం..సమాజంలో గౌరవం
- విదేశాల్లో స్థిరపడిన ఇద్దరు కుమార్తెలు

చంద్రగిరి: మంచి ఉద్యోగం.. సమాజంలో అంతకు మించిన గౌరం. ఇద్దరు కుమార్తెలు విదేశాల్లో స్థిరపడ్డారు. ఆస్తిపాస్తులకు కొదవలేదు. అందరితో కలివిడిగా ఉండేవారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా తామున్నామంటూ ముందుకొచ్చేవారు. అయితే వారికి ఏం కష్టం వచ్చిందో తెలియదుగానీ కలసి జీవిస్తున్న దంపతులు ఇద్దరూ ఒకే చెట్టుకు ఉరివేసుకుని తనవు చాలించారు. ఈ ఘటన చంద్రగిరి మండలం, కూచువారిపల్లిలో విషాదాన్ని మిగిల్చింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి మండల పరిధిలోని కూచువారిపల్లికి చెందిన పడిమల సురేంద్ర నాయుడు(55), లత (45) దంపతులు తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ, శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. సురేంద్ర నాయుడు తిరుపతి విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్. తాతముత్తాలకు చెందిన ఆస్తులతో పాటు విద్యుత్ శాఖలో మంచి వేతనంతో జీవనం సాగిస్తున్నారు. దంపతులకు నైనా, నిఖిత ఇద్దరు కుమార్తెలున్నారు. వీరిద్దరూ విదేశాల్లో స్థిరపడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో సురేంద్ర నాయుడు తన సెల్‌ఫోన్, ఇతర గుర్తింపు కార్డులను ఇంట్లోనే ఉంచి తన భార్య లతతో కలసి బుధవారం స్వగ్రామం కూచువారిపల్లికి చేరుకున్నారు. గ్రామస్తులతో కాసేపు ముచ్చటించి అక్కడి నుంచి మధ్యాహ్నం ఇద్దరూ తమ వ్యవసాయ భూమి వద్దకు చేరారు. అప్పటికే వెంట తీసుకొచ్చిన తాడును వేపచెట్టుకు వేసి దంపతులిద్దరూ ఉరివేసుకుని తనువు చాలించారు. విషయం తెలుసుకున్న పెద్ద కుమార్తె నైనా ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన తల్లిదండ్రులను చూసి కుప్పకూలిపోయారు. మమల్ని వదిలివెళ్లిపోయారా మమ్మీ..డాడీ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.


తల్లిదండ్రుల మృతితో బోరున విలపిస్తున్న కుమార్తె నైనా


సురేంద్ర నాయుడు, లత దంపతులు (ఫైల్)

తలలో నాలుకలా..

సురేంద్ర నాయుడు మొదటి నుంచి వివాదరహితుడు. తన సహచర ఉద్యోగులతో పాటు గ్రామస్తులు, ప్రజలతో కలివిడిగా ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. తరచూ గ్రామానికి వచ్చి గ్రామాభివృద్ధితో పాటు స్థానికులకు ఏదైనా అవసరమైతే తప్పకుండా సాయం చేసేవాడు. విద్యుత్ శాఖలో కూడా ఎలాంటి వివాదాలకు వెళ్లకుండా సహచర ఉద్యోగులతో చాలా సరదాగా ఉండేవారు. ఉద్యోగంలో ఇబ్బందులు ఏమీ లేవని, పూర్వీకుల ఆస్తిపాస్తులతో ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి మంచి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటం అక్కడ వారిని తీవ్రంగా కలిచి వేసింది.

కుటుంబ గొడవలే కారణమా?

దంపతుల ఆత్మహత్యపై సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు రామకృష్ణ, అనిత సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోలీసు జాగిలాలను తీసుకొచ్చి సంఘటనా స్థలంలో పరిశీలించారు. సురేంద్ర నాయుడు, లత దంపతుల ఆత్మహత్యకు కారణం కుటుంబ గొడవలే అయ్యి ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అసలు గొడవ ఎందుకు జరిగింది.. ఎప్పటి నుంచి జరుగుతున్నాయి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్


ముద్దాయిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పాకాల: పాత నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ మద్దయ్య ఆచ్చారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, చంద్రగిరి ఎస్‌డీపీఓ బేతపూడి ప్రసాద్ ఆదేశాల మేరకు నిఘా వ్యవస్థను బలోపేతంచేసి బెంగళూరు, చిత్తూరు, కదిరి, మదనపల్లిలో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడిన పాత నేరుస్తుడు సీపీ.శ్రీనివాసులు, (సీతాలచ్చోనోల్ల శ్రీనివాసులు)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతను గత పదేళ్లుగా ఎవ్వరికీ దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నాడని, ఇతనిపై గతంలో కడప, చిత్తూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల పరిధిలోని పలు స్టేషన్లలో 20 కేసులు ఉన్నాయన్నారు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు పాకాల రైల్వేస్టేషన్ ముందు ముద్దాయిని అరెస్ట్ చేశామన్నారు. పాకాల స్టేషన్ పరిధిలోని అతనిపై మూడు కేసులున్నట్టు పేర్కొన్నారు. ముద్దాయి వద్ద నుంచి 117 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40,000ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ముద్దాయిని పట్టుకోవడంలో హెచ్‌సీలు విశ్వనాథ్, చలపతి, సోమశేఖర్, పీసీలు మునిశేఖర్ బాబు, విష్ణుప్రసాద్ చాకచక్యంగా వ్యవహరించారన్నారు. ఈ మేరకు వారిని సీఐ అభినందించారు.

క్రిస్మస్ వేడుకల్లో భారతి సిమెంట్స్


కేక్ కట్ చేస్తున్న బిషప్, భారతి సిమెంట్స్ ప్రతినిధులు, నాయకులు


భారతి సిమెంట్స్ క్యాలెండర్‌ను విష్కరించిన బిషప్ మైకెల్ బెన్‌హర్

నాయుడుపేట టౌన్: అన్ని వర్గాలవారిని కలుపుకుంటూ మతసామరస్యానికి ప్రతీకగా భారతి సిమెంట్స్ యాజమాన్య ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి బిషప్ రైట్‌రెవరెండ్ ఓ మైకల్ బెన్‌హర్ కొనియాడారు. ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలను సంఘ పెద్దలు, యువతతో కలిసి జరుపుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. భారతి సిమెంట్స్ కంపెనీ నెల్లూరు జిల్లా మేనేజర్ జేఎస్.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బిషప్‌తో పాటు పీసీసీ మాజీ చైర్మన్ కేఎం.ఆనందరావు, కేఎంవీ.కళాచంద్ర, సండే స్కూల్ సూపరిడెంట్ ప్రేమ్‌చంద్ తదితరులు నాయుడుపేట ఎస్ఏఎల్‌సీ చర్చి ఆవరణలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ చేతుల మీదుగా భారీ కేక్ కట్‌చేయించి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షాలు తెలిపారు. బిషప్ మాట్లాడుతూ క్రిస్మస్ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భారతి సిమెంట్ యాజమాన్యానికి బిషప్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారతి సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీ సిమెంట్స్ నెల్లూరు జిల్లా టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి , స్థానిక భారతి సిమెంట్స్ డీలర్లు శైలేష్ ట్రేడర్స్ యజమాని కామిరెడ్డి అమరేంద్రరెడ్డి, విజయ గణపతి స్టీల్ అండ్ సిమెంట్స్ యాజమాని ఇరుగు భరత్, బాలాజీ ట్రేడర్స్ యాజమాని కరింబాయి చెంచయ్య మొదలియార్, సంఘ యువత బెన్‌హర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తిరుపతి రూరల్‌లో 20 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్: గంజాయి విక్రయాలు, డెన్‌లపై తిరుపతి రూరల్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తిరుపతి రూరల్ మండలం అవిలాల చెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం మెరుపుదాడులు చేశారు. అక్కడ గంజా విక్రయిస్తున్న గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మినగర్‌కు చెందిన చాంద్‌బీబీ వద్ద 9.374 కిలోలు, మదనపల్లె మండలం బురకాయలకోటకు చెందిన కొండకమర్ల రాజులమ్మ నుంచి 2.532 కిలోలు, తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన సాయి నుంచి 8.248 కిలోలు మొత్తం 20.154 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. నిందితులు మదనపల్లె మండలం బురకాయలకోట నుంచి గంజాయిని సేకరించి తిరుపతి, చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు.

పట్టుబడిన భార్యాభర్తలు

దొరవారిసత్రం: దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో పలు చోరీలకు పాల్పడిన చెన్నై ప్రాంతానికి చెందిన భార్యాభర్తలను స్థానిక పోలీసులకు అరెస్ట్ చేశారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కథనం.. చెన్నై ప్రాంతంలోని పాండికుప్పంకి చెందిన భార్యాభర్తలైన మోసెష్, వసంతి పలు చోట్ల దొంగతాలు చేసుకుంటూ జీవనం సాగించేవారు. మోసెష్‌పై చెన్నైలోని పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదయ్యాయి. దీంతో అతను అక్కడి నుంచి పరారై నాయుడుపేట పట్టణ ప్రాంతంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరు రెండు రోజుల కిందట డీవీ సత్రంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ దుకాణంలో రెండు సెల్ ఫోన్లు, పలు వస్తువులు చోరీచేశారు. అదేవిధంగా సూళ్లూరుపేటలో కూడా ఓ బైక్ చోరీ చేశారు. ఈ మేరకు భార్యాభర్తలను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

పళ్లిపట్టు: స్కూటీని టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఆంధ్రాకు చెందిన ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమిళనాడులోని పళ్లిపట్టు సమీపంలోని నగరి రాష్ట్ర రహదారి మార్గంలో కరింబేడు వద్ద స్కూటీని టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో స్కూటీలో వెళ్తున్న తిరుపతి జిల్లా పుల్లూరుకు చెందిన సురేష్(34) అక్కడికక్కడే మృతి చెందారు. అతనితో ప్రయాణించిన అదే గ్రామానికి చెందిన వినోద్(24) కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నగరి ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి మృతదేహం చేపట్టిన పళ్లిపట్టు పోలీసులు పోస్టుమార్టం కోసం తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌కు సాదర స్వాగతం


మహారాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న తిరుపతి ఆర్డీఓ, నేతలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): తిరుపతి తిరుమల రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కి తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, లైజన్ అధికారి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, టీటీడీ బోర్డు సభ్యులు రామ్మూర్తి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, ప్రజా ప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుమలకి బయలుదేరి వెళ్లారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర గవర్నర్

చంద్రగిరి: మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో..

- ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట) : ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు. రేణిగుంట జీఎం స్టేట్‌లో నివాసముంటున్న సహిత(22) లండన్‌లో ఎంబీఏ పూర్తిచేసి ఇటీవలే ఇంటికి వచ్చింది. ఇక్కడ ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రేణిగుంట ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.